

**రంజాన్ వేళలు**

ఇఫ్తార్
సా. 6:25 (గురువారం)
సెహరీ
ఉ. 4:49 (శుక్రవారం)

## పారదర్శకంగా
### వృత్తి పన్ను వసూళ్లు



కార్పొరేషన్ పరిధిలో ఏప్రిల్ 1 నుంచి వాణిజ్య పన్నుల శాఖ ద్వారా వృత్తి పన్ను వసూలు

రాష్ట్ర పన్నుల జాయింట్ కమిషనర్ ఎస్.ప్రశాంత్ కుమార్

వివరాలు 2లో...

18వ వసంతంలోకి...
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
గురువారం 27 మార్చి 2025
పేజీలు 8

### నిఘా నేత్రాల ఏర్పాటు కోసం

# భారీ వసూళ్లు



- ఖర్చు గోరంత.. చందాలు వసూళ్లు కొండంత
- భారీ మొత్తంలో చందాలు దారి మళ్ళిస్తున్న వైనం

(జగ్గయ్యపేట మార్చి 26 మేజర్ న్యూస్)

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నియోజకవర్గంలో నేరాలను అదుపు చేసే దిశగా పోలీస్ యంత్రాంగం ప్రతిష్టంగా నిఘా నేత్రాలను (సిసి కెమెరాలను) ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వలన నియోజకవర్గంలో 2

### చినగొల్లపాలెం తీరప్రాంత రక్షణకు

# త్వరలో చర్యలు



- అలల ఉధృతికి భూమి కోల్పోతున్న గ్రామస్తులు
- ఎంపీ వల్లభనేని బాలశౌరి

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలానికి చెందిన చిన గొల్లపాలెం, ఆంధ్రప్రదేశ్‌లోని ఒక తీరప్రాంత గ్రామం. సముద్రపు అలల ఉధృతికి భూమి కోల్పోతున్నందున గ్రామ స్తులకు, సాగు భూములకు ఇక్కడ తీవ్రమైన నష్టం జరుగుతోంది. ఇక్కడ ఉప్పెనల ఉద్ధృతి పెరగడం, అలలు భూమిని క్రమంగా దుమ్ము చేయడం, కలుషిత నీటి ప్రవాహాలు సముద్రతీరాన్ని నెమ్మదిగా దెబ్బతీయటం, వాతావరణ మార్పులతో సముద్ర స్థాయి పెరగడం, అతిగా ఇసుక తవ్వకాలు తీర ప్రాంత భూమిని బలహీనం కావడం, మ్యాంగ్రోవ్ అడవుల నాశనం వలన ప్రకృతిసిద్ధమైన మిగతా 2లో...

### మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి

# శీరంకు అనుకూలమేనా?



- మరి దాదాపు లైన్ క్లియర్ అయిందా?
- ఈ చైర్మన్ పదవి ఆశించిన వారికి నామినేటెడ్ లు వచ్చాయి
- ఈ రేసులో ఏకైక వ్యక్తి ఒక్క శీరం మాత్రమే
- మరి చిరునవ్వుల కాగిత చూపు ఎటువైపు?

**పెడన, మేజర్ న్యూస్ :** ఎస్వీ పల్లి గ్రామానికి చెందిన శీరం ప్రసాదు ప్రస్తుతం మండల టీడీపీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఈయన మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి రేసులో గత కొంతకాలంగా పోటీపడుతున్నారు. అందరితో కలగలుపు ధోరణి ఇతనిది. అంతేగాక ప్రస్తుత ఎమ్మెల్యే కాగితకు మంచి అనుచరుడు దివంగత నేత వెంకట్రావుకు కూడా ముఖ్య అనుచరుడు. ముఖ్యంగా చూసుకుంటే కాగిత కుటుంబానికి మిక్కిలి ఆత్మీయుడు, టీడీపీ వీరాభిమాని. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఈ పదవిపై శీరం ఆశలు పెంచుకున్నారు. అయితే ఈ మార్కెట్ యార్డు పక్క మండలం అయినా

మిగతా 2లో...

(మొదటిపేజీ తరువాయి)

## మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి శీరంకు అనుకూలమేనా?



గూడూరు వరకు కూడా విస్తరించి ఉంది. గతంలో ఈ చైర్మన్ పదవి కాంగ్రెస్, టీడీపీ, వైసీపీలకు చెందిన నాయకులు నిర్వహించారు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఈ చైర్మన్ పదవిని నిర్వహించిన అర్జున భాస్కరరావు గూడూరు మండలానికి చెందిన వ్యక్తి కాగా, మిగిలిన ఇద్దరు కూడా పెడన మండలానికి చెందిన వారే అవ్వటం గమనార్హం. అయితే ఇప్పుడు ఈ చైర్మన్ పదవి పెడన మండలానికి దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అదేగాని జరిగితే శీరం కు ఛాన్స్ దక్కినట్టే. ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వంలో జనసేన పార్టీ నాయకులు కూడా ఈ చైర్మన్ పదవిని ఆశించారు. ఆశించడమే కాకుండా విశ్వ ప్రయత్నాలు కూడా చేశారు. దీంతో ఆశించిన వారికి కొన్ని నామినేటెడ్ పదవులు రావడంతో లైన్ క్లియర్ అయింది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల ఆఖరికి నామినేటి పోస్టుల భర్తీ దాదాపు నిర్ణయించి తనకు సరైన న్యాయం చేస్తారని శీరం ఆశిస్తున్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ చిరునవ్వుల మధ్య ఎవరి పేరు బయటికి వస్తుందో వేచి చూడాల్సి ఉంది.

## పారదర్శకంగా వృత్తి పన్ను వసూళ్లు

### కార్పొరేషన్ పరిధిలో ఏప్రిల్ 1 నుంచి వాణిజ్య పన్నుల శాఖ ద్వారా వృత్తి పన్ను వసూలు

### రాష్ట్ర పన్నుల జాయింట్ కమిషనర్ ఎస్.ప్రశాంత్ కుమార్



**విజయవాడ, మార్చి 26, మేజర్ న్యూస్ :** వృత్తి పన్ను వసూళ్లను సరళీకృతం చేసి మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరిగిందని విజయవాడ 1, 2 డివిజన్ వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ ఎస్.ప్రశాంత్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాణిజ్య పన్నుల శాఖ ద్వారా వృత్తి పన్నుదారుల నుంచి పన్నుల వసూలును పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వృత్తి పన్ను వసూలు బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం వాణిజ్య పన్నుల శాఖకు అప్పగించడం జరిగిందని వెల్లడించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వృత్తి పన్ను వసూళ్లను వాణిజ్య పన్నుల శాఖకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెం.63 జారీచేసిందని, ఇది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుందన్నారు. వివిధ వర్గాలకు చెందిన వేతన జీవులు, వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులు వారికి నిర్దేశించిన రేట్ల ప్రకారం వృత్తి పన్ను చెల్లించాల్సి ఉంటుందన్నారు. దుకాణ యజమానులు, రూ. 10 లక్షల కంటే అధిక వార్షిక టర్నోవర్ ఉన్న జీఎస్టీ పన్ను చెల్లింపుదారులు వృత్తి పన్ను చెల్లించాల్సి ఉంటుందన్నారు. వాణిజ్య, వ్యాపార, పారిశ్రామిక సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు నెలకు రూ. 15 వేల కంటే ఎక్కువ జీతం చెల్లిస్తున్న యజమానులు ఉద్యోగుల తరఫున ప్రభుత్వానికి వృత్తి పన్ను చెల్లించాలని ఆయన వివరించారు. 2025, మార్చి పన్ను కాలానికి (2025, ఏప్రిల్‌లో దాఖలు చేయాల్సిన) నెలవారీ ప్రొఫెషనల్ ట్యాక్స్ రిటర్న్‌ను https://myprofessiontax.apct.gov.in/ptax/ వెబ్‌సైట్లో లాగిన్ అయి దాఖలు చేయాలని జాయింట్ కమిషనర్ ప్రశాంత్ కుమార్ తెలిపారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కుమార్ రాజా



**పామర్రు మార్చి 26 మేజర్ న్యూస్ :** పామర్రులో గల మసీదు వద్ద బుధవారం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులతో కలిసి కొద్దిసేపు నమాజ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఇఫ్తార్ విందు కార్యక్రమంలో భాగంగా ముస్లిం సోదరులకు ఆయన స్వయంగా వడ్డన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, చాట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిఘా నేత్రాల ఏర్పాటు కోసం భారీ వసూల్

(మొదటిపేజీ తరువాయి)



జరిగే అసాంఘిక కార్యకలాపాలను వెంటనే అదుపు చేయటం జరుగుతుందని పోలీసులు ముందుచూపుతో ఆలోచించి ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గంలో సుమారుగా 500 సీసీ కెమెరాలు ఏర్పాటుకు పోలీసులు రంగం సిద్ధం చేశారు. దీనికోసం భారీ స్థాయిలో ఖర్చు అవడంతో కొంతమంది రాజకీయ నాయకులు, పారిశ్రామికవేతలు విద్యాలయాలు, వైద్యశాలల యాజమాన్యాల(దాతల) నుండి చందాలు వసూలు చేస్తున్నారు. దీనిలో భాగంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆయన పరిధిలో ఉన్న నాలుగు పోలీస్ స్టేషన్లో ఇన్స్పెక్టర్లకు వారి పరిధిలో ఎన్ని నిఘా నేత్రాలు అవసరమో అంచనాలు వేసి దాన్ని ప్రకారం వారి పరిధిలో ఉన్న వారి (దాతల) ద్వారా చందాలు వసూలు చేసి ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇచ్చి నట్లు సమాచారం. దానితో జగ్గయ్యపేట, చిల్లకల్లు, పెనుగంచిప్రోలు వత్సవాయి సబ్ ఇన్స్పెక్టర్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆదేశాల ప్రకారం నిఘానేత్రాలను ఏర్పాటులో తనామొనకలై కొంతవరకు ఏర్పాటు చేసినట్లు తెలుస్తుంది. ఇదిలా ఉండగా సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎక్కువ కాలం కమిషనరేట్లో పిఆర్వోగా పనిచేశానని కమిషనర్ నాకు బాగా తెలుసని చెలామణి అవుతూ తన అధికారంతో నియో జకవర్గంలో ఉన్న పారిశ్రామికవేత్తల నుండి ప్రముఖ వ్యాపారస్తుల నుండి భారీ స్థాయిలో చందాలు వసూళ్లు చేసినట్లు తెలుస్తుంది. సర్కిల్ ఇన్స్పెక్టర్ హెూం శాఖ మినిస్టర్ చేత నియోజకవర్గంలోని అన్ని నిఘా నేత్రాలను ఓపెనింగ్ చేయడం జరుగుతుందని భారీగా ఖర్చు అవుతుందని ప్రచారం చేసుకుంటూ కొన్ని లక్షల రూపాయల చందాలు వసూలు చేసి పక్కదారి పట్టించినట్లుగా ప్రజలు అనుమానాలు వ్యక్తపరుతున్నారు. ఈ విధంగా ఖర్చు గోరంత చందాలు వసూళ్లు కొండంత.. ఇదిలా ఉండగా జగ్గయ్యపే ట, చిల్లకల్లు, పెనుగంచిప్రోలు, సబ్ ఇన్స్పెక్టర్లు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని నూతన సాంకేతిక పరమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే వత్సవాయి సబ్ ఇన్స్పెక్టర్ మాత్రం నాసిరకం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలుస్తుంది దీనివలన భవిష్య త్తులో ఆర్థికపరమైన నష్టాలు ఏర్పడతాయని టెక్నీషియన్ల నుండి తెలుస్తుంది. ఈ విధంగా వత్సవాయి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ మాత్రం తూతూ మంత్రంగా నాసిరకం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున చందాలు వసూలు చేసినట్లు వినికిడి. హెూమ్ శాఖ మంత్రి పర్యటన ముసుగులో గుట్టు చప్పుడు కాకుండా కొన్ని లక్షల రూపాయల చందాలు వసూలు చేసి పక్కదారి పట్టించిన సర్కిల్ ఇన్స్పెక్టర్ పై విచారణ జరిపించి అలాగే నాసిరకం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అధిక మొత్తంలో చందాలు వసూలు చేసిన వత్సవాయి సబ్ ఇన్స్పెక్టర్ పై కూడా విచారణ జరి పించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. తన అవినీతిపై వరుస కథనాలు రాస్తున్న కలం గొంతు నొక్కి అసభ్య పదజా లాలతో తిడుతూ అక్రమ కేసులు పెడతానని బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలు చేస్తున్నట్లు వినికిడి.

# చినగొల్లపాలెం తీరప్రాంత రక్షణకు త్వరలో చర్యలు

(మొదటిపేజీ తరువాయి)



రక్షణ కోల్పోవడం, పట్టణీకరణ, నిర్మాణ పనులు, తీరప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు పెరగడం వల్ల భూగర్భ మార్పులు జరగడం, సముద్రపు అలల ధాటికి భూమి కొట్టుకుపోయి, క్రమంగా గ్రామం మునిగిపోయే ప్రమాదం ఉంది. అంతేకాకుండా నది, సముద్రపు నీరు భూముల్లోకి చొచ్చుకుపోవడం వల్ల వ్యవసాయ భూములు ఉప్పు నేలగా మారుతున్నాయి. జీవనోపాధిపై ప్రభావం చూపిస్తోంది. మత్స్యకారుల జీవనాధారం దెబ్బతింటోంది, వేటకారులు తమ ప్రదేశాలను వదిలి వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇందుకు పరిష్కార మార్గాలు ఏమిటంటే,రక్షణ గోడల నిర్మాణం సముద్రపు అలలను అడ్డుకునేందుకు రక్షణ గోడలు బ్రేక్ వాటర్ స్ట్రక్చర్స్ నిర్మిం చడం. మడ అడవుల పరిరక్షణ: ప్రకృతిసిద్ధంగా సముద్రపు అలలను అడ్డుకు నేందుకు మ్యాంగ్రోవ్ మొక్కలను పెంచడం,ఇసుక తవ్వకాలను నియంత్రణ: అక్రమ ఇసుక తవ్వకాలను కఠినంగా నిరోధించడం, తీరప్రాంత సంరక్షణ ప్రణాళికలు: సైన్సటిఫిక్ కోస్టల్ మేనేజ్‌మెంట్ ప్రణాళికలు రూపొందించి, టెక్నాలజీ సహాయంతో సముద్రపు అలలను అరికట్టడం,ప్రభుత్వ సహాయ కార్యక్రమాలు: తీరప్రాంత గ్రామాలను తరలించేందుకు పునరావాస కార్యక్ర మాలు చేపట్టడం, రైతులకు నష్టపరిహారం అందించడం వంటి పనులు జరగా ల్సి ఉంది. ఇందు కోసం మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి బుధవారం ఢిల్లీలోని నేషనల్ డిశాస్టర్ మేనేజుమేంట్ అథారిటీ మెంబర్, హెడ్ అఫ్ డిపార్ట్మెంట్ రాజేంద్ర సింగ్ ని కలిసి కృత్తివెన్ను మండలంలోని చిన గొల్లపాలెంలో సముద్రపు అలల వలన క్రమంగా క్షీణిస్తున్న భూమి గురించి, అందుకు తీసుకొనవలసిన రక్షణ చర్యల గురించి మాట్లాడటం జరిగింది. వారు ఎంపి వినతికి సానుకూలంగా స్పందించి వెంటనే తగు ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం నుండి వచ్చిన యెడల, నిధులు మంజూరు చేసి చర్యలు తీసుకొంటామని తెలియ పరిచారు.

## రజాస్టార్ హఫీజ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



**నందిగామ, మార్చి 25, మేజర్ న్యూస్:** పట్టణంలోని జామ (పెద్ద) మసీదు నందు రజాస్టార్ ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రొప్రైటర్ మహమ్మద్ హఫీజ్ మిత్ర బృందం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హఫీజ్ మాట్లాడుతూ రంజాన్ మాసం సమాజంలోని భక్తి ,భావం, పవిత్రత, సేవా సంప్రదాయం , కట్టుబాట్లకు నిదర్శనం ఇదాయిత్ అంటే ముస్లిం సోదరులు తనతోపాటు పేదవారికి సహాయం చేయాలని ఇస్లాం చెప్పిన ప్రకారం మనందరం ఒకరికొకరు చేతోడు వాదోడులుగా ఉండాలన్నారు. బుధవారం సాయంత్రం మగ్రిబ్ నవాజ్ అనంతరం భారీ లంగర్ ఏర్పాటుచేసి షబే ఖాధర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, హఫీజ్ మిత్ర బృందం తదితరులు పాల్గొన్నారు.

## మరమ్మత్తు పనులను పరిశీలించిన చైర్మన్ కృష్ణకుమారి



**నందిగామ , మార్చి 26, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ విప్ , స్థానిక శాసన సభ్యురాలు శ్రీమతి తంగిరాల సౌమ్య ఆదేశాలతో పట్టణంలోని 10వ వార్డు పరిధిలో మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి బోరు మరమ్మతు పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి సమస్య ఎక్కడ ఉండకూడదని అవసరమైన ఏరియాలో ట్యాంకర్లు పంపించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు గోపు పూర్ణ , రాటకొండ రమణ ,రంగారావు మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## స్వచ్ఛ సేవలో కేరళ బైబిల్ కళాశాల యువకులు

**చల్లపల్లి మేజర్ న్యూస్ :** స్ఫూర్తివంతంగా సాగుతున్న స్వచ్ఛ చల్లపల్లి సేవా కార్యక్రమంలో కేరళ బైబిల్ కళాశాల యువకులు పాల్గొని సేవలందించారు. కేరళ బైబిల్ కళాశాలలో శిక్షణ పొందుతున్న మిజోరం రాష్ట్రం యువకుడు చోచో, తమిళనాడు యువకులు శివబాలన్, అద్రెల్లా, కాకినాడ యువకుడు శామ్యూల్లు ప్రాక్టికల్ మినిస్ట్రీ నిమిత్తం చల్లపల్లికి చెందిన దైవసేకుడుగోల్కొండ డేవిడ్ వద్దకు వచ్చారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యేందుకు డేవిడ్తో పాటు బైబిల్ కళాశాల యువకులంతా బుధవారం తెల్లవారుజామున జరిగిన 3424వ రోజు స్వచ్ఛసేవలో పాల్గొన్నారు. పాగోలు రోడ్డులోని ఎన్టీఆర్ పాఠశాల ప్రాంతంలో స్వచ్ఛ కార్యకర్తలతో కలిసి సేవలందించారు.

## ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

**చల్లపల్లి మేజర్ న్యూస్ :** రంజాన్ ఉపవాసాల సందర్భంగా చల్లపల్లి టీడీపీ నేత రావి రాజేశ్వరరావు నారాయణరావు నగర్ మసీదులోని ముస్లిం సోదరులకు బుధవారం ఇఫ్తార్ సమయంలో అల్పాహారం అందచేశారు. సాయంత్రం నమాజు అనంతరం ముస్లిం సోదరులను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలియచేసి ఖర్జూరాలు, పండ్లు, స్వీట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్టియుసి రాష్ట్ర కార్యదర్శి రావి చిట్టి, వార్డు సభ్యుడు షేక్ సిలార్, మసీదు కమిటటీ పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు. ఉపవాసాలు అందిస్తున్న ముస్లిం సోదరులకు అభినందనలు తెలిపారు.

# క్రాంప్టన్ ఇన్ఫినియా ఆవిష్కరణతో సరికొత్త ఆలోచనతో లైటింగ్

**20% అదనపు వెలుగు & స్లిమ్‌ఓ - అల్ట్రా-స్లీక్ అప్పీల్!**

**ఈ కొత్త ఉత్పత్తులు ఏ ఇంటీరియర్‌కైనా మినిమలిస్ట్ డిజైన్‌ను బోల్డ్ ఎలిగెన్స్‌తో మిళితం చేస్తాయి**




**విజయవాడ, మార్చి 26, మేజర్ న్యూస్ :** అలంకరణ, సౌందర్యపరంగా ఉన్నతమైన లైటింగ్ కొత్త శ్రేణిని తీసుకువస్తూ, క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, రెండు కొత్త ఉత్పత్తులను ప్రారంభించడం ద్వారా తన బాటెన్ లైట్స్ పోర్ట్‌ఫోలియో శ్రేణిని విస్తరించింది %-% ఇన్ఫినియా 24డబ్ల్యూ అనేది ప్రిస్టెక్ టెక్నాలజీతో ప్రత్యేకంగా రూపొందించబడిన ఇన్ డైరెక్ట్ లైటింగ్ ప్రోడక్ట్. ఇన్ఫినియా 24డబ్ల్యూ డెకరేటివ్ ఎండ్ క్యాప్‌లతో కూడిన ప్రత్యేకమైన డిజైన్‌తో వస్తుంది. ఇది సౌందర్యపరంగా ఆకర్షణీయమైన ఫినిష్‌తో ప్రకాశవంతమైన కాంతిని ఇస్తుంది. అలాగే, ఆధునిక నివాస స్థలాలను పూర్తి చేయడానికి రూపొందించబడిన డెకరేటివ్ ఎండ్‌క్యాప్‌లతో కూడిన స్లిమ్‌ఓ 20డబ్ల్యూ అనే 15% స్లిమ్మర్ బ్యాటెన్‌ను కూడా ఆవిష్కరించింది. ఈ ఎల్ఈడీ లైట్లు అధునాతన లైటింగ్ టెక్నాలజీ, సొగసైన సౌందర్యాన్ని మిళితం చేసి, ఇళ్ళు, కార్యాలయాలు రెండింటికీ సరైన వాతావరణాన్ని సృష్టిస్తాయి. అలంకరణను మెరుగుపరచడం ద్వారా, ఈ కొత్త ఫిక్చర్‌లు స్థలాలను ప్రకాశవంతం చేయడమే కాకుండా సమకాలీన, అధునాతన స్పర్శను కూడా జోడిస్తాయి. ఇంటీరియర్ లను మార్చడానికి అనువైన ఈ లైట్లు, కార్యాచరణ, చక్కదనాన్ని సజావుగా మిళితం చేస్తాయి. పరిసరాలను ఆహ్వానించే, దృశ్య పరంగా ఆకర్షణీయమైన సెట్టింగులుగా మారుస్తాయి. లైటింగ్ అనేది ఒక ప్రాథమిక అవసరం నుండి ఆంబియన్స్, వ్యక్తిగత శైలిని నిర్వచించే ఒక ముఖ్యమైన డిజైన్ అంశంగా మారింది. ఆధునిక వినియోగదారులు తమ నివాస స్థలాలను అలంకరణను మెరుగుపరిచే, అదే సమయంలో సరైన వెలుతురును కూడా అందించే లైటింగ్ సొల్యూషన్‌లతో మార్చుకోవాలని ఎక్కువగా కోరుకుంటున్నారు. దీనిని గుర్తించి క్రాంప్టన్ పనితీరు, సౌందర్యం మధ్య పరిపూర్ణ సమతుల్యతను సాధించడానికి రూపొందించిన తన తాజా శ్రేణి ఉత్పత్తులను పరిచయం చేస్తోంది. ఈ స్టైలిష్, సమర్థవంతమైన లైటింగ్ ఫిక్చర్‌లు, ఇంటి పరివర్తనలకు గుండెకాయ లాంటి లివింగ్ రూమ్‌లను ఆధునిక డిజైన్‌తో ప్రకాశాన్ని సజావుగా మిళితం చేయడం ద్వారా ఉన్నతీకరించడానికి రూపొందించబడ్డాయి. ఈ ఆవిష్కరణతో, క్రాంప్టన్ ఇంటి లైటింగ్‌ను పునర్నిర్వచించింది. ఆయా స్థలాలను ప్రకాశవంతం చేయడమే కాకుండా అందంగా తీర్చిదిద్దే పరిష్కారాలను అందిస్తుంది. తన బాటెన్ శ్రేణికి రెండు కొత్త మోడళ్లను అందిస్తూ, కింది ఉత్పత్తులు సమకాలీన జీవన ప్రదేశాలలో సజావుగా మిళితం అయ్యేలా రూపొందించబడ్డాయి, ఇవి పనితీరు, శైలి రెండింటినీ మెరుగుపరుస్తాయి.

**ముఖ్య విశిష్టతలు:**

**ఇన్ఫినియా 24డబ్ల్యూ:** ఇన్ఫినియా బాటెన్ తన బోల్డ్, అద్భుతమైన డిజైన్‌తో ప్రత్యేకంగా నిలుస్తుంది. ఏ గదిలోనైనా ఆక ర్షణకు కేంద్రబిందువుగా ఉండేలా రూపొందించబడింది. చక్కదనాన్ని పనితీరుతో కలిపి, ఇది మీ స్థలానికి ప్రీమియం సౌందర్యాన్ని తెస్తుంది. ప్రిస్టెక్ టెక్నాలజీ, క్రోమ్ ఫినిషింగ్‌తో కూడిన ఇన్ఫినియా 24డబ్ల్యూ బ్యాటెన్ మీ గదిని మృదువైన, ఇన్ డైరెక్ట్ లైటింగ్ తో ప్రకాశవంతం చేసి ప్రశాంతమైన, విశ్రాంతి వాతావరణాన్ని సృష్టిస్తుంది. ప్రకాశవంతమైన కాంతి అవుట్‌పుట్, ఐస్మైల్ ఫీచర్‌తో అనుబంధించబడి, ప్రశాంతమైన అనుభవాన్ని నిర్ధారిస్తుంది.

**స్లిమ్‌ఓ 20డబ్ల్యూ:** స్లిమ్‌ఓ బాటెన్ మినిమలిస్ట్, సొగసైన డిజైన్‌ను అందిస్తుంది. దీన్ని ఆధునిక ఇంటీరియర్‌లకు అనువైన ఎంపికగా చేస్తుంది. దీని ప్రత్యేకమైన ఎండ్ క్యాప్స్, స్లిమ్ ప్రొఫైల్ దీనిని తరగతిలో అత్యంత సన్నదిగా చేస్తాయి. క్లీన్, స్టైలిష్ సౌందర్యాన్ని నిర్ధారిస్తుంది. విస్తృత కాంతి వ్యాప్తి మొత్తం ప్రకాశాన్ని పెంచుతుంది. సమతుల్యమైన, ఆహ్వానించే వాతావరణాన్ని సృష్టిస్తుంది. ఇది తేలికైనది, ఇన్‌స్టాల్ చేయడం సులభం. స్లిమ్‌ఓ 20డబ్ల్యూ బ్యాటెన్ అనేది లైటింగ్ సొల్యూ షన్స్‌లో పనితీరు, డిజైన్ రెండింటినీ విలువైనదిగా భావించే వారికి సరైన ఎంపిక. బాటెన్ శ్రేణికి ఈ కొత్త చేర్పులు శైలి, లైటింగ్ పనితీరు ఖచ్చితమైన మిశ్రమాన్ని అందిస్తాయి. ఇది ఏ నివాస స్థలానికి అయినా అనువైనది. వీటి సొగసైన, ఆధునిక డిజైన్ మీ అలంకరణను మెరుగుపరుస్తూనే ప్రశాంతమైన ప్రకాశాన్ని అందిస్తుంది. వినూత్న, గ్లేర్ రహిత ప్రకాశంతో ఇవి సౌకర్యం, శైలి రెండింటినీ అందిస్తాయి. ఈ కొత్త చేర్పులు కంపెనీ ప్రారంభించిన కన్స్యూమర్ లైటింగ్ ఉత్పత్తుల ప్రీమియం శ్రేణిలో భాగం. బాటెన్ లైటింగ్ శ్రేణికి కంపెనీ కొత్తగా జోడించిన ఈ మోడల్స్ గురించి క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, లైటింగ్ వైస్ ప్రెసిడెంట్ & బిజినెస్ హెడ్ షలీన్ నాయక్ మాట్లాడుతూ, "లైటింగ్ కేవలం ప్రకాశాన్ని అందించడం కంటే ఇంటి అలంకరణ, డిజైన్‌లో కీలకమైన అంశంగా కూడా మారిందని క్రాంప్టన్‌లో మేం గుర్తించాం. ఇది వినియోగదారు అనుభవాన్ని, వ్యక్తిగత శైలిని మెరుగుపరుస్తుంది. బాటెన్ శ్రేణికి మా సొగసైన ఇన్ఫినియా24డబ్ల్యూ, సొగసైన స్లిమ్‌ఓ 20డబ్ల్యూ మోడల్స్‌ను జోడించడం ఈ పరివర్తనను ప్రతి బింబిస్తుంది. ఇన్ఫినియా 24డబ్ల్యూ ఉన్నతమైన ప్రకాశాన్ని అందించడమే కాకుండా, గ్లేర్ రహిత, సౌకర్యవంతమైన వాతావరణాన్ని కూడా సృష్టిస్తుంది. ఏ గది వాతావరణాన్ని అయినా మెరుగుపర్చడానికి రూపొందించబడిన ఈ స్టైలిష్, సమర్థవంతమైన లైటింగ్ ఎంపికలు ఇంట్లో లేదా కార్యాలయంలో ప్రతి స్థలాన్ని బాగా ప్రకాశవంతం చేస్తాయి. చక్కదనం, పనితీరు రెండింటినీ నిర్ధారిస్తాయి" అని అన్నారు. ఈ రెండు ఉత్పత్తులు సరళమైన ఇన్‌స్టాలేషన్ ప్రక్రియను అందిస్తాయి. ఇంటి యజమానులు పాత ఫిక్చర్‌లను ఆధునిక, స్టైలిష్ ఎంపికతో అప్‌గ్రేడ్ చేయడం సులభం చేస్తాయి. దేశవ్యాప్తంగా అధీకృత క్రాంప్టన్ రిటైలర్ల వద్ద, ప్రముఖ ఇ-కామర్స్ ప్లాట్ ఫామ్‌లలో లభించే ఈ కలెక్షన్, నివాస స్థలాలను ప్రకాశవంతం చేయడానికి, ఇంటీరియర్ డెకర్‌ను మెరుగుపరచడానికి రూపొందించబడింది.

## పీఎంజేజే అసంఘటిత కార్మికులకు కొండంత అండ

**పండ్ల వర్తక సంఘ అధ్యక్షుడు గోకరకొండ బలరాం**



**గుడివాడ, మేజర్ న్యూస్ :** అసంఘటిత కార్మికులకు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి పథకం కొండంత అండని పండ్ల వర్తక సంఘ అధ్యక్షుడు గోకరకొండ బలరాం అన్నారు. అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన పండ్ల వర్తక సంఘ సభ్యురాలు పూడి బుజ్జి కుటుంబ సభ్యులకు జీవనజ్యోతి బీమా యోజన పథకం చెక్కును పండ్లవర్తక సంఘ అధ్యక్షుడు బలరాం పోస్టల్ శాఖ అధికారులతో కలిసి పోస్టల్ కార్యాలయంలో బుధవారం అందచేశారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకాన్ని కార్మికులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోస్ట్ ఆఫీస్ సూపరిండెంట్ ముత్యాల శ్రీనివాసరావు, అసిస్టెంట్ సూపరిండెంట్ వెంకట్రావులు మాట్లాడుతూ పట్టణ పరిధిలోని పండ్ల వర్తక సంఘ సభ్యులందరికీ అధ్యక్షుడు బలరాం సొంత ఖర్చులతో ప్రతి సంవత్సరం యోజన పథకాన్ని కల్పించడం అభినందనీయమన్నారు. ప్రజల శ్రేయస్సుకు పోస్టలా శాఖ అందిస్తున్న పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐపిఓ బి. విజయ్, ఐపిపిబి మేనేజర్ గణేష్, గుడివాడ పండ్ల వర్తక సంఘ నాయకులు పెద్ది కిషోర్, అప్పన్న, నైనాల చిన్న, పిడుగు గోపి, వెంకటరమణ, గుండు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రేమాంజలి ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ ముగించిన మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

పెడన, మేజర్ న్యూస్ : ప్రేమాంజలి సామాజిక సేవా కేంద్రం ద్వారా ఇప్పటికే వివిధ పెడన పట్టణం, గ్రామాల్లో టైలరింగ్ శిక్షణ కార్యక్రమం పూర్తి చేసుకున్న 40 మంది మహిళలకు ప్రేమాంజలి సామాజిక సేవా కేంద్రం ద్వారా కుట్టుమిషన్ లు అందించడం జరిగిందని ఆ సంస్థ కోఆర్డినేటర్ సిస్టర్ హెలెన్ తెలిపారు. మేరకు శిక్షణ పొందిన మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ అందించారు. ఈ సందర్భంగా సిస్టర్ అని మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రేమాంజలి సామాజిక సేవా కేంద్రం ద్వారా మహిళలకు 110 కుట్టు మిషన్లను స్పాన్సర్ చేశామని, ఇది మహిళల కుటుంబాలకు గొప్ప ఆసరాగా ఉందన్నారు. ప్రేమాంజలి సామాజిక సేవా కేంద్రం ఆశయంలో భాగంగా స్త్రీ స్వతంత్రంగా ఉండాలని, వారి కుటుంబాలకు మద్దతుగా ఉండాలని, వారు ఎదుగుతున్న విధంగా ఇతరులకు విద్యను అందించాలని కోరుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ జెనీఫర్ ద సోషల్ అండ్ హెల్త్ అపోస్టిలేట్, (మైసూర్ ), శిక్షణ పొందిన మహిళలు, సేవా కేంద్రం సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## ఏఐ శక్తితో శాంసంగ్ గెలాక్సీ ఎ26 5జీ




**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శాంసంగ్, ఏఐ శక్తితో కూడిన అత్యంత సరసమైన స్మార్ట్ ఫోన్ గెలాక్సీ ఎ26 5జీని మార్కెట్లోకి విడుదల చేసింది. ప్రీమియం గ్లాస్ బ్యాక్ సౌందర్యంతో పీచ్, మింట్, వైట్, బ్లాక్ అనే నాలుగు రంగుల్లో ఇవి అందుబాటులో ఉన్నాయి. ఎక్సినాస్ 1380 ప్రాసెసర్, 25 డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జింగ్, 5000 ఎంఏహెచ్ బ్యాటరీతో రోజంతా పనిచేస్తుంది. రూ. 22,999 ప్రారంభ ధరతో అన్ని ఆన్లైన్ ప్లాట్ఫాంలు, శాంసంగ్ స్టోర్లు, దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రిటైల్ స్టోర్లలో గెలాక్సీ ఎ26 5జీ అందుబాటులో ఉంటుంది.

## 170 పైగా పట్టణాలకు అమేజాన్ ఫ్రెష్ నాణ్యమైన కిరాణా సరుకులు

**విజయవాడ మేజర్ న్యూస్ :** అమేజాన్ ఫ్రెష్ యొక్క గణనీయమైన విస్తరణను అమేజాన్ ఇండియా ప్రకటించింది. దీని పూర్తి బాస్కెట్ కిరాణా సరుకుల సేవలు ఇప్పుడు దేశవ్యాప్తంగా170 నగరాలు, పట్టణాలలో విస్తరించాయి. ఈ విస్తరణ హెచ్2'24 వెర్సస్ హెచ్2'23లో అమేజాన్ ఫ్రెష్ యొక్క ప్రభావితపరిచే 50 శాతం ఇయర్-ఓవర్-ఇయర్ వృద్ధి సమ యంలోనే కలిగింది. అమేజాన్ డాట్ ఇన్ పై అత్యంత వృద్ధి చెందే శ్రేణులలో ఒకటిగా తన స్థానాన్ని బలపరిచింది. అమేజాన్ ఫ్రెష్ పండ్లు, కూరగాయలు, పాలు,బ్రెడ్, ఫ్రోజెన్ ఉత్పత్తులు, సౌందర్య వస్తువులు, బేబీ కేర్ అవసరాలు, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులు, పెట్ సరఫరాలు సహా వెట్, డ్రై కిరాణా సరుకుల విస్తృత శ్రేణిని అందిస్తోంది. ఈ సేవలు గొప్ప ఆదాలు, విస్తృత శ్రేణి ఎంపిక, నిర్దిష్టమైన సమయాలలో ఇంటి వద్ద డెలివరీలు చేసే సౌకర్యంతో నిరంతరంగా షాపింగ్ అనుభవాన్ని కేటాయించే లక్ష్యాన్ని కలిగి ఉన్నాయి.

## ఈ నెల 28లోగా ఫేజ్-2 వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి

**జిల్లా ఎస్‌సీ సంక్షేమం, సాధికారత అధికారి కె.శ్రీనివాస శిరోమణి**

**విజయవాడ, మార్చి 26, మేజర్ న్యూస్ :** ఉచిత డీఎస్‌సీ కోచింగ్‌కు షార్ట్‌లిస్ట్ చేయబడిన ఎస్‌సీ, ఎస్‌టీ అభ్యర్థుల జాబితా https://mdfc.apcf-ss.in పోర్టల్‌లో ఉందని, జాబితాలోని అభ్యర్థులు ఈ నెల 28వ తేదీలోగా ఫేజ్-2 వెబ్ ఆప్షన్ సర్వీస్ ద్వారా ఎంప్యానెల్డ్ కోచింగ్ సంస్థలకు తమ ప్రాధాన్యతలు ఇవ్వాలని జిల్లా ఎస్‌సీ సంక్షేమం, సాధికారత అధికారి కె. శ్రీనివాస శిరోమణి బుధవారం ఓ ప్రకటనలో సూచించారు. వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ద్వారా అభ్యర్థులు అన్ని కోచింగ్ సంస్థలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ దశలో ఫేజ్-1 వెబ్ ఆప్షన్లను సవరించేందుకు వీలవదని తెలిపారు.

## నేడు రెండు గ్రామపంచాయతీలలో ఉప సర్పంచ్ ఎన్నిక

**తోట్లవల్లూరు మార్చి 26 మేజర్ న్యూస్ :** తోట్లవల్లూరు మండల పరిధిలోని యాకమూరు, పెనమకూరు గ్రామపంచాయతీలకు ఈనెల 27వ తేదీ గురువారం ఉప సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎండిఓ కె.రవికాంత్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే ఎన్నికల అధికారులను ఆయా గ్రామ పంచాయతీలకు నియమించామన్నారు. యాకమూరు గ్రామానికి మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి ఉదయభాస్కరరావును, పెనమకూరు గ్రామపంచాయతీకి ఈఓఆర్డి వెంకటేశ్వరమ్మ ను నియమించినట్లు తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుండి ఉప ఎన్నిక కార్యక్రమం జరుగుతుందన్నారు.

## అంకితభావంతో విధులు నిర్వహించాలి

**జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఉప్పాల హారిక**



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఉద్యోగ విధులు బాధ్యతాయుతంగా అంకితభావంతో నిర్వహించాలని జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఉప్పాల హారిక సూచించారు. బుధవారం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ నగరంలోని వారి చాంబర్లో 17 మందికి కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. అందులో 12 మంది జూనియర్ అసిస్టెంట్లుగా, మరో 5మంది టైపిస్టులుగా నియమించబడ్డారు. జిల్లాలోని ఉపాధ్యాయులు పంచాయతీరాజ్ ఉద్యోగులు 17 మంది విధి నిర్వహణలో ఉంటూ మరణించడంతో వారి వారసులకు నియామక పత్రాలు అందజేసినట్లు జడ్పీ చైర్ పర్సన్ వివరించారు. కొత్తగా నియమించబడిన ఉద్యోగులు సజావుగా వారికి అప్పగించిన విధులను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీసీఈఓ కన్నమ నాయుడు, డిప్యూటీ సీఈవో ఆనందకుమార్ జెడ్పీ సిబ్బంది పాల్గొన్నారు.



## గాంధీ మహాత్ముని కాంస్య విగ్రహ ఏర్పాటుకు విరాళం

**గన్నవరం, మార్చి 26, మేజర్ న్యూస్ :** గన్నవరం సెంటరులో ప్రస్తుతము ఉన్న గాంధీజీ రాతి విగ్రహం స్థానంలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ఆర్యవైశ్య సంఘం సభ్యులు రూ. 4.5 లక్షల విరాళాన్ని స్థానిక శాసన సభ్యునికి అందజేశారు. మహాత్మా గాంధీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి శోభాయమానంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సంకల్పించడంతో.. దానికి తోడ్పాటుగా ఆర్య వైశ్య సంఘం తమ వంతుగా రూ. 4,55,799లు అందజేసినట్లు ఆర్య వైశ్య సంఘం ప్రతినిధి మదుపల్లి బాల కృష్ణ మూర్తి తెలియజేశారు. విరాళం అందించేందుకు ఎమ్మెల్యేని కలిసిన వారిలో గొంట్ల బాల శంకర్, గొంట్ల యజ్ఞ నారాయణ, కందగడ్డల శ్రీనివాసరావు, తాడికొండ ప్రసాదు, చంద్రపాటి బాజీ ప్రసాదు, కూర్మాల సత్య శ్రీనివాస్ కుమార్, కూర్మాల రామ్మోహన్ గుప్తా, అప్పల బాలకృష్ణ రావు, మదుపల్లి బాలకృష్ణమూర్తి, మదుపల్లి విద్యాసాగర్, మోటమర్రి శేఖర్, కంచర్ల శివ నాగేశ్వరరావు, తాడికొండ నాంచారయ్య, బూరగడ్డ రామ్మోహన్ రావు, మామిడి సత్యమూర్తి, కందగడ్డల నాగేశ్వరరావు, శ్రీకాకుళపు సత్యనారాయణ సాయి, మామిడి బాబ్జి, మామిడి రామకృష్ణ, మట్టా వెంకట సుధాకర్ రావు, కొప్పర్తి చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు. వీరందరికీ ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

## ముస్తాబాద్‌లో ఇఫ్తార్ విందు



**గన్నవరం, మార్చి 26, మేజర్ న్యూస్ :** గన్నవరం మండలంలోని ముస్తాబాద్ గ్రామంలో ముస్లిం సోదర, సోదరీమణులకు ఇఫ్తార్ విందును ఇవ్వడం జరిగింది. గన్నవరం మండలం ముస్తాబాద్ గ్రామానికి చెందిన స్వర్గీయ షేక్ దస్తగిరి సాహెబ్, జవహర్ బేగం ల జ్ఞాపకార్థం వారి కుమారులు గ్రామంలో ఉపవాసం ఉంటున్న దాదాపు 450 మంది ఉపవాస దీక్ష పరులకు స్థానిక కళ్యాణ మండపంలో ఇఫ్తార్ విందు ఇవ్వడం జరిగింది. వారి కుమారులలో ఒకరైన నవభారత్ హైస్కూల్ కరస్పాండెంట్ షేక్ ఇమామ్ మాట్లాడుతూ సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు ఉపవాస దీక్షలు చేపడుతున్న ముస్లిం సోదరులకు తమ తల్లిదండ్రుల పేరు మీద మంగళవారం రాత్రి ఇఫ్తార్ విందును ఇవ్వడం జరిగిందని గ్రామంలోని ప్రతి ముస్లిం ఈ ఇఫ్తార్ విందులో పాల్గొని విజయవంతం చేసినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తమ సోదరులు మహమ్మద్ అక్బర్, మహమ్మద్ ఉస్మాన్, మహమ్మద్ ఉమర్, మహమ్మద్ అహ్మద్ అలీ, మహమ్మద్ షఫీ ఉల్లా, షేక్ ఈసా రూపుల్లా, షేక్ ఖలీల్ రెహమాన్, గ్రామ పెద్దలు, మత పెద్దలు పాల్గొనడం జరిగింది.

## చట్టాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కల్గి ఉండాలి



**గుడివాడ, మేజర్ న్యూస్ :** ప్రతి విద్యార్థి చట్టాల పట్ల పూర్తిగా అవగాహన కల్గిఉండాలని అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ పి.గాయత్రి సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అధ్వర్యంలో రాజేంద్రనగర్ లో గుత్తా రామకృష్ణయ్య టౌన్ హైస్కూల్లో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులకు చట్టాలపై ప్రత్యేక అవగాహనను న్యాయమూర్తి గాయత్రి కల్పించారు. విద్యార్థినిలకు ఆకతాయిల వేధింపులు, లైంగిక వేధింపులపై అవగాహన కల్పించారు. ఎవరి మాయమాటలు నమ్మి ఫోన్ నెంబర్లు ఇవ్వకుడదన్నారు. బహుమతులకు లొంగి తల్లితండ్రులకు తెలియకుండ ఎక్కడికి వెళ్ళరాదన్నారు. ఈ కార్యక్రమంలో 1టౌన్ పోలీసులు, శక్తి టిమ్ సభ్యులు శిరిష, పారా లీగల్ బాలంటీర్లు, తదితరలు పాల్గొన్నారు.

# మౌళిక వసతుల కల్పనకు రూ.86 కోట్లతో డీపీఆర్ సిద్ధం



### ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

**గుడివాడ, మేజర్ న్యూస్ :** గుడివాడలో పేద వర్గాల నివాసిత ప్రాంతాల్లో వసతుల కల్పనకు రూ. 86కోట్ల వ్యయంతో డిపిఆర్ సిద్ధం చేసి ప్రభుత్వనికి పంపించినట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. రాజేంద్రనగర్లోని ఎమ్మెల్యే వెనిగండ్ల స్వగృహంలో పబ్లిక్ హెల్త్, మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే రాము సమీక్షసమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ. 22.50 కోట్లతో తాగునీటి పంపిణీ నిర్వహణకు, పైప్లైన్లు, నూతన ట్యాంకుల నిర్మాణ ప్రతిపాదనలు, రూ. 10,90 కోట్లతో కనీస వసతుల కల్పనకు రూపొందించిన ప్రతిపాదనలు రూ. 52.74 కోట్లతో పట్టణంలోని పెద్దవీధి, కొత్తపేట, ముబారక్ సెంటర్, కొత్తపేట, బైపాస్ రోడ్డు, గుమ్మాన్పేట తదితర 13 కిలోమీటర్ల పరిధిలోని ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ మెరుగు, సీనరైజ్ మురుగు నీటి శుద్ధి ట్యాంక్ నిర్మాణానికి పైలెట్ ప్రాజెక్టుగా రూపొందించిన అంచనాల ప్రతిపాదనలను గుడివాడ పట్టణ శాటిలైట్ మ్యాప్ నమూనా ద్వారా ఎమ్మెల్యే రాముకు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము విలేకర్లతో మాట్లాడుతూ గుడివాడ రూపురేఖలు మార్చేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. అధికారులు రూపొందించిన అంచనాల నిధులు సాధించేందుకు మున్సిపల్ మంత్రి నారాయణ, సంబంధిత శాఖల ఉన్నత అధికారులను కలుస్తానన్నారు. సిఎం చంద్రబాబు సహకారంతో ఎంపీ వల్లభనేని బాలశౌరీతో కలిసి అమృత 2.0నుండి నిధులు సాధిస్తానన్నారు. ఈ సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఈ.ఇ స్వామి నాయుడు, డి.ఇ పాండురంగరావు, మున్సిపల్ ఇంజనీరు ఏ ఎస్ ఎన్ ప్రసాద్, కన్సల్టెన్సీ డైరెక్టర్ శాస్త్రి, టిడిపి నాయకులు పెద్దు శ్రీకాంత్, పబ్లిక్ హెల్త్, మున్సిపల్, కన్సల్టెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైల్వే ప్రయాణికుల కష్టాలు ఇంకెన్నాళ్లు?

### రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలసౌరిలకు, లంకిశెట్టి బాలాజీ విజ్ఞప్తి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కోట్లాది రూపాయలు కేటాయించి నిర్మించిన స్థానిక నూతన రైల్వే స్టేషన్ వల్ల ప్రయాణికులు కష్టాలు రోజు రోజుకు మరింత పెరిగాయని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లంకి శెట్టి బాలాజీ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇక్కడ నుండి విజయవాడకు రైల్వే డబుల్ లైనింగ్ వేసినా కూడా ప్రయాణ సమయం మాత్రం నత్త నడకగా నడుస్తోందన్నారు. ప్రతిరోజు విశాఖపట్నం నుండి మచిలీపట్నం వచ్చే రైలు గుడివాడ నుండి మచిలీపట్నం రావడానికి 35 కిలోమీటర్ల కి రెండు గంటల సమయం పడుతోందన్నారు. భీమవరం లాంటి చిన్న పట్టణంలో రెండు రైల్వే స్టేషన్లు, రెండు లిఫ్టులు ఉన్నాయని మచిలీపట్నంలో మాత్రం లిఫ్ట్ భాగ్యానికి నోచుకోలేదన్నారు. ఉదయం ఏడు గంటలకు విజయవాడ వెళ్లే రైలు మూడో నెంబర్ ప్లాట్ఫారం పై ఉంచడం వల్ల ఉద్యోగస్తులు, విద్యార్థులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విశాఖపట్నం రైలు రెండు, మూడు ప్లాట్ఫారాలలో ఉంచడం వల్ల, లిఫ్ట్ కనీసం రైల్వే కూలీలు లేకపోవడంతో వృద్ధులు, మహిళలు దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విజయవాడ నుండి రాత్రిపూట మచిలీపట్నం వచ్చే రైలులో రైల్వే పోలీస్ బందోబస్తును పటిష్టపరచాలని, ప్రయాణికులకు సెక్యూరిటీ ఇవ్వాలని బాలాజీ డిమాండ్ చేశారు. ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటలకు విజయవాడ నుండి మచిలీపట్నం వచ్చే రైలుకు రెండున్నర గంటల సమయం పట్టడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గుడివాడలో రైలు ఎక్కువ సమయం నిలపకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైల్వే స్టేషన్ లో పార్కింగ్ ఫీజు అధికంగా ఉందని రైల్వే టికెట్ కంటే పార్కింగ్ ఫీజు ఎక్కువగా కావడం వల్ల ఇబ్బంది పడుతున్నారని తెలియజేశారు. మచిలీపట్నం నుండి ప్రతి రెండు గంటలకు గుడ్లవల్లేరు గుడివాడ స్టాపులతో విజయవాడకు అదనపు రైళ్లు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మచిలీపట్నం తిరుపతి రైలు రెగ్యులర్ గా మచిలీపట్నం నుండి ఏర్పాటు చేయాలని కూడా బాలాజీ డిమాండ్ చేశారు. మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు బాలసౌరి జిల్లా ముఖ్య కేంద్రం నుండి ప్రయాణికులకు రైళ్లు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కేంద్ర రైల్వే శాఖతో తక్షణమే చర్చలు జరపాలని కోరారు.

# రైతులకు అవగాహన సదస్సుల నిర్వహణ

### అగ్రికల్చర్ అధికారిణి హారిక



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బందరు మండలంలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించామని ఏవో హారిక తెలిపారు. ఈ సదస్సులో రాష్ట్ర స్థాయి అధికారులు పాల్గొనడం ఆనందదాయకంగా ఉందన్నారు. అగ్రికల్చర్ అధికారిణి హారిక ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి ప్రకృతి వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక తయారీ లో భాగంగా కన్వర్జెన్స్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో గ్రామ సభ జరిపే విధానం, రైతులతో సమావేశాలు, గ్రామ సంఘం సమావేశాలు, సంఘ సమావేశాలలో రైతు కుటుంబాలతో ఏమి మాట్లాడిలి? ఎలా మాట్లాడాలనే విషయాలు గురించి అవగాహన కల్పించడం జరిగింది.రైతుల దగ్గర సేకరించిన సమాచారం వివోఏ,వి ఏ ఏ లతో కలిసి 2025-26 ఆర్థిక సంవత్సర ప్రకృతి వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక సంఘం, గ్రామసంఘం గ్రామ సభలలో ఆమోదం తీసుకోవడం గూర్చి కూడా తెలియ చేయటం జరిగిందన్నారు.దీనిలో భాగంగా ఏపీ సీఎన్ఎఫ్ 9 సార్వత్రిక సూత్రాలు అమలు విధానం పిఎండిఎస్ వలన ప్రయోజనాలు, రైతులకు పిఎండిఎస్ గురించి ఏ విధంగా అవగాహన కల్పించి విత్తన కిట్లు ఎలా తయారు చేసుకుని వారికి అందించాలనే విషయం గురించి చర్చించామన్నారు. కిట్స్ తయారీ కి ఎస్ హెచ్ జి సభ్యులు, సంఘాలు గ్రామాసంఘాల నుండి ఏ విధంగా నిధులు సమకూర్చుకోవాలి? అనే విషయం గురించి చర్చించారు. గ్రామాలలో పిఎండిఎస్ విత్తనాలు వేయటం వలన కలిగే ప్రయోజనాలను రైతులకు చెప్పి ఇండెంట్ తీసుకుంటామని, ఏపీ సీఎన్ ఎఫ్ గ్రామాలనుండి సప్లయ్ చెయ్యాలి అని హారిక చెప్పగా ఎన్ పి ఎం షాప్ యజమాని సప్లయ్ చేస్తామని చెప్పారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యాలయం నుండి వచ్చిన శ్రీకర్ ప్రకృతి వ్యవసాయ పద్దతి లో వ్యవసాయం చేయటం వలన కలిగే లాభాల గూర్చి రైతులకు పూర్తి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎం ఏ ఓ హారిక ఏపీ సీఎన్ ఎఫ్ అడిషనల్ డి పి ఎం నాగ మల్లేశ్వరి, స్టేట్ ఆఫీసు సిబ్బంది శ్రీకర్,స్వామి బాబు, భూలక్ష్మి, వ్యవసాయ శాఖకి సంబంధించి వాస్, డి ఆర్ డి ఏ సిబ్బంది ఏపీఎం సిసిఎస్ వివోఎలు, ఏపీ సిఎన్ ఎఫ్ సిబ్బంది యూనిట్ ఇంచార్జీ లు, ఐ సి ఆర్ పిలు పాల్గొన్నారు.

# ఔట్ ఫాల్ డ్రైన్ పనులు త్వరగా పూర్తి చేయండి









**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** అవుట్ ఫాల్ డ్రైన్ పనులు త్వరగా పూర్తి చేయాలి అని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా టికిల్ రోడ్, పినమనేని పాలీ క్లినిక్ రోడ్, కృష్ణవేణి రోడ్, పటమట ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జరుగుతున్న నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని రానున్న వర్షాకాలంలో, వర్షపు నీటి నిల్వలు రోడ్డు మీద నిలవకుండా సైడ్ కాలువలో నిరంతరాయంగా ప్రవహించేటట్టు అధికారులు డిసిల్టింగ్ పనులు ఎప్పటికప్పుడు చేసుకుంటూ ప్రతినిత్యం పర్యవేక్షిస్తుండాలని అధికారులను ఆదేశించారు.

తదుపరి పటమటలోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, కిచెన్లో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఉండేటట్టు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తాగునీటి సరఫరా, వాడుకునేటి సరఫరా నిత్యం అధికారులు పర్యవేక్షిస్తుండాలని, ఎండాకాలంలో ప్రజలకు కావాల్సిన అవసరాలకు తగ్గట్టుగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె. షమ్మీ, ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, తదితరులు పాల్గొన్నారు.



## డస్ట్ బిన్‌ల పంపిణీలో పాల్గొన్న గోపు సత్యనారాయణ

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కానూరు పంచాయతీలోని వన్నారు కానూరు, చిన్నకానూరు, కొత్తి ల్లు, గణపా బత్తుల కానూరు గ్రామాలలో కృష్ణా జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ప్రతిపాదించిన స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజలకి తడి చెత్త, పొడి చెత్త డస్ట్ బిన్ల పంపిణీ చేసారు.గోపు సత్యనారాయణ మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త గూర్చి ప్రజలకు వివరించారు,చెత్తను డస్ట్ బిన్ లో వేయాలని, ప్లాస్టిక్ కవర్లు వాడకం నిషేధించాలని అన్నారు.జనసేన పార్టీ ఇంచార్జ్ దివి మహేష్,పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వరరావు, గోపు వెంకటరమణ, బొలిశెట్టి నాని, వి. చిన్నా, ఈ.వెంకన్న, జొన్నల నాగ మల్లేశ్వర రావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



## బీజేపీ మండల కమిటీ సమావేశం



**నందిగామ, మార్చి 26, మేజర్ న్యూస్:** పట్టణం లోని బిజెపి కార్యాలయంలో మండల కమిటీల మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇన్చార్జి నర్సింగ్ రావు. నందిగామ ఇన్చార్జి మాదాల రమేష్., అసెంబ్లీ కన్వీనర్ తొర్లికొండ సీతారామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ పాల్గొని మండల కమిటీల సభ్యులందరూ ప్రజల్లోకి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకొని ఆ సమస్యలు అధికారుల వద్దకు తీసుకువెళ్లి పార్టీ యొక్క విశిష్టతను చాటాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భారత దేశం లో అన్ని రాష్ట్రాల్లో పేదల కొరకు అనేక సంక్షేమ పథకాలు పెట్టి పేద ప్రజలందరికీ చేరువ చేస్తున్నారని. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో నరేంద్ర మోడీ ఆంధ్ర ప్రదేశ్‌కు అనేక మైన. అమరావతి రాజధాని కి. పోలవరానికి అనేక నిధులు ఇస్తున్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. బిజెపి పార్టీని కూడా ప్రజల్లోకి తీసుకువెళ్లి బూత్ కమిటీలు పూర్తి చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో తొర్లికొండ సీతారామయ్య, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, మునగంటి కామేశ్వరరావు, బండారు కేదార్నాథ్ శర్మ, బుర్ర వెంకట్రావు, ఊటుకూరు సత్యనారాయణ గుప్తా, కేతేపల్లి ప్రసాదు, కొత్త సాంబశివరావు, గుత బాలకృష్ణ, కనితి సుబ్బారావు, తులసి కృష్ణ, మురుమూరి శివ, య ర గొర్ల రవి, శివరాత్రి గోపి, కొణిదల జోగేశ్వర రావు, ఆదిలక్ష్మి, రోజా, దామ కృష్ణకుమారి, రజియా బేగం, అక్కి స్వామి, కొంగర రమేష్, నిడమానూరు రాఘవేంద్ర, చిలకా శ్రీను, డాక్టర్ సత్యనారాయణ, సిద్ధాంతి రమేష్, దేవత వెంకటేశ్వరరావు, కొల్లిపర గోపాలకృష్ణ, డాక్టర్ రాంబాబు, సురేంద్ర, కుమారి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

**ఏపీ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**

**నందిగామ, మార్చి 26, మేజర్ న్యూస్:** ప్రజాసమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. బుధవారం కాకానీ నగర్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పెద్దఎత్తున ప్రజలు వినతులు అందజేశారు. తాగునీటి సమస్యలు, రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందజేశారు. ఈ సందరంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావస్తున్నా గత వైసిపి పాలనలో పరిష్కారం కానీ ఎన్నో రెవెన్యూ సమస్యలతో ప్రజలు నేటికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని రెవిన్యూ అధికారులు ఎక్కడా కూడా అలసత్వం వహించకుండా తక్షణమే సమస్యల పరిష్కార దిశగా పనిచేయాలని సూచించారు. ప్రజా దర్బార్‌లో వచ్చే ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రమణబాబు, తహసిల్దార్ సురేష్, కూటమి నేతలు అధికారులు పాల్గొన్నారు.

## మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలి

**ఎమ్మెల్యే బుద్ధప్రసాదుకు మర్రె గంగయ్య ఆధ్వర్యంలో సన్మానం**



**కోడూరు మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మరింత గుర్తింపు సాధించే స్థాయిలో ఉన్నత స్థాయి పదవులు అధిరోహించాలని జనసేన పార్టీ కోడూరు మండల అధ్యక్షులు మర్రె గంగయ్య ఆకాంక్ష వ్యక్తం చేశారు. రాష్ట్ర అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మనుగా నవ్యాంధ్ర తొలి ఉప సభాపతి, ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, అవనిగడ్డ ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ నియమితులు అయిన సందర్భంగా సోమవారం సాయంత్రం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గంగయ్య ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ కోడూరు టౌన్ అధ్యక్షులు కోట రాంబాబు, నాయకులు పూతబోయిన సీతారత్న సాయిబాబు, పూతబోయిన కరుణకుమార్, కాగిత రామారావు, సిద్దినేని అశోక్ నాయుడు, పులిగడ్డ పిచ్చేశ్వరావు, ముద్దినేని చందర్రావు, అప్పికట్ల వినోద్, మానేపల్లి సత్యనారాయణ సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం





**పామర్రు మార్చి 26 మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు పామర్రు శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పామర్రులోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం సమస్యలను వదిలేసి దోచుకోవడమే ధ్యేయంగా పనిచేసిందన్నారు.

ఈ కారణంగా ప్రజలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని అయోమయ స్థితి నుండి తమను ఎన్నుకున్నాక సమస్యలు పరిష్కారం అవుతాయనే భరోసాతో తమ వద్దకు వస్తున్నారన్నారు. తాము కూడా ప్రభుత్వం ఏర్పడిన దాదాపు పది నెలల కాలంలో ఇప్పటికే పలు సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. ప్రధా నంగా భూ సమస్యలు, ఇళ్ల స్థలాలు, ఇళ్ళు, పింఛన్లు, డ్రైన్ లో నిర్మాణం వంటి వాటిపై ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు అందుతున్నాయని తెలిపారు. వీటన్నింటిని సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. పలువురికి సంబంధించిన వ్యక్తిగత సమస్యలపై అప్పటికప్పుడు అధికారులతో ఎమ్మెల్యే కుమార్ రాజా ఫోన్లో సంప్రదించి వాటిని పరిష్కరించాలని సూచించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో అర్జీదారులు తరలిరావడంతో పార్టీ కార్యాలయం వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర లింగమనేని రామలింగేశ్వరరావు జక్కా శ్రీనివాసరావు కొసరాజు వెంకటేశ్వరరావు చింతమనేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## నైపుణ్యం పెంచుకుంటేనే భవిష్యత్

### కెయూ ఉపకులపతి ఆచార్య కె రాంజీ

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** విద్యార్థులు,యువత ఎప్పటికప్పుడు తమ నైపుణ్యంను మెరుగు పరుచుకుంటేనే భవిష్యత్ లో రాణిస్తారని కృష్ణా విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ పేర్కొన్నారు. బుధవారం కె యూ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యములో వారం రోజులుగా నిర్వహిస్తున్న సి ఆర్ టి శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్ర సంగించారు. విద్యార్థులలో నైపుణ్యం పెంపొందించేందుకు విశ్వవిద్యాల యం ఆన్లైన్‌లో కూడా తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటా మన్నా రు. విద్యార్థులు, యువత చదవడం, వినడం ద్వారా చాల తెలుసుకోవచ్చని ఆ అలవాటు ను దినచర్యగా నార్చుకోవాలన్నారు. త్వరలో విశ్వవిద్యాలయం లో ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తామని చెప్పారు. క్యాంపస్ లో ఉన్నప్పుడు ఒక్కో విద్యార్థికి మూడు ఉద్యోగాలు అందుబాటులో వుంటాయినీ, బయటకు వెళితే ఒక్కో ఉద్యోగానికి వెయ్యి మంది పోటీ పడాల్సివుంటుందని గుర్తుం చుకోవాలన్నారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష, డీన్ ఆచార్య వై కే సుందర కృష్ణ, ఆచార్య దిలీప్, అతిథి ఉపన్యాసకులు డా. దిట్టకవి వెంకటేశ్వరరావు డివిఆర్ ముదిగొండ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## సోలార్ విద్యుత్‌ను సద్వినియోగపర్చుకోండి

### విద్యుత్ ఏఈ రవికుమార్



**ఘంటసాల, మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన ఘంటసాల శ్రీ శక్తి భవన్‌లో సౌర విద్యుత్ పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగపరుచుకోవాలని ఆ విధంగా ప్రతి ఒక్కరికి తెలియజేయాలని ఏపిఎం టి శ్రీనివాసరావు అధ్య క్షతన ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో విద్యుత్ ఏఈ పి రవికుమార్ వివో ఏలకు వెలుగు కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఆయన మాట్లా డుతూ ప్రతి ఒక్కరూ సోలార్కు అప్లై చేసుకోవాలని ఈ సోలార్ ప్రతినెల 125 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేస్తుందన్నారు. సోలార్ రూఫ్ టాప్ ప్యా నల్స్ సూర్యుని వేడిని పీల్చుకోవడం వల్ల ఇల్లు చల్లగా ఉంటుందన్నారు చు ట్టూ చల్లటి గాలి కూడా ఉంటుందన్నారు వినియోగదారుడు 5 సం"ల లోపు మూలధనం మొత్తాన్ని తిరిగి పొందుతారన్నారు. 1 కె.వికి లక్షకు రూ 30 వేలు రూ.2 కెవికి రూ.2 లక్షలకు రూ 60 వేల సబ్సిడీ కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అందిస్తుందని నారు. ప్రతి ఒక్కరు సద్వినియోగపరచుకోవాలని ఆ యన కోరారు. కార్యక్రమంలో ఎమ్మెస్ ప్రెసిడెంట్ టీ పార్వతి ట్రెజరర్ వి వెంకటేశ్వరమ్మ, సీసీలు ఝాన్సీ, నాగేశ్వరమ్మ, నరసమ్మ పాల్గొన్నారు..

### ఎమ్మెల్యే సహకారంతో..

## నూరు శాతం సీసీ రోడ్ల నిర్మాణానికి కృషి



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సహ కారంతో గ్రామంలో నూరు శాతం సీసీ రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి తెలి పారు. బుధవారం చల్లపల్లిలో ఉపాధి పథకం నిధులు రూ.నాలుగు లక్షలతో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణకుమారి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకొని చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మార్చు తోందన్నారు. పల్లె పండుగకార్యక్రమం ద్వారా చల్లపల్లిలోను పెద్దసంఖ్యలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ నిధులు కేటాయించి అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ పీవీ మాధవేంద్రరావు, వార్డ్ సభ్యులు మీర్ రిజ్వాన్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పీ.ఎన్.వీ వంశీకృష్ణ, స్థానికులు పాల్గొన్నారు.

# పారిశుధ్య రహిత గ్రామంగా తీర్చిదిద్దుదాం




**ఏ కొండూరు, మేజర్ న్యూస్ :** గ్రామాన్ని పారిశుధ్యరహిత గ్రామంగా తీర్చి దిద్దుతామని సర్పంచ్ మోర్ల లక్ష్మీ సాంబశివరావు అన్నారు. మండలంలోని చీమలపాడు గ్రామంలో బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మోర్ల లక్ష్మి సాంబశివరావు మాట్లాడుతూ గ్రామంలోని వీధులలో ఎక్కడ చెత్త కుప్పలు లేకుండా చూడడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. అక్కడక్కడ ఉన్న చెత్తకుప్పలను జెసిపి ద్వారా చెత్త సంపద తయారీ కేంద్రానికి తరలించి వానపాములు ఎరువుగా మార్చబడుతుందని తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర లో భాగంగా ప్రతి ఒక్కరు కూడా చెత్తను పురవీధుల్లో వేయకుండా ప్రతి ఇంటికి ఇచ్చిన తడి చెత్త పొడి చెత్త డబ్బాలలో వేసి చెత్త సేకరించే ట్రాక్టర్ వచ్చినప్పుడు చెత్తను అందులో పడవేయాలని ఆమె సూచించారు. అలానే గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని ప్రతి ఒక్కరూ కూడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను నిషేధించాలని పచారీ సరుకులు తెచ్చుకునే సమయంలో ఇంటి నుంచే గుడ్డ సంచులను తీసుకొని వెళ్లి సరుకులు తెచ్చుకోవాలని ప్రతి ఒక్కరు కూడా బాధ్యతగా ఉంటే ప్లాస్టిక్ రహిత గ్రామంగా గ్రామాన్ని తీర్చిదిద్దుకోవచ్చని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఉండి గ్రామాన్ని చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దుకుంటే భవిష్యత్తులో గ్రామానికి మంచి పేరు వస్తుందని పంచాయతీకి నిధులు సమకూరుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ కార్యదర్శి భూక్య గోపికృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.



## నీటి ఎద్దడి నివారణకు నిధులు కేటాయింపు

**కంచికచర్ల మేజర్ న్యూస్ :** వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడని నివారించేందుకు బోర్లు నిర్మాణం, మరమ్మతులకు నిధులు కేటాయించడం జరిగిందని ఎంపీపీ మలక్ బషీర్ అన్నారు.కంచికచర్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ మలక్ బషీర్ అధ్యక్షతన జరిగింది. ఈ సర్వసభ్య సమావేశంలో పలు అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలి పారు. ఈ సందర్భంగా ఎంపీపీ మలక్ బషీర్ మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడిని నివారించేందుకు మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులతో మండలములోని గండేపల్లి గ్రామంలో నూతనముగా 3 బోర్లు, గొట్టుముక్కల 3, మొగులూరు 1, కంచికచర్ల 1 నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా కంచికచర్ల అంబేద్కర్ కాలనీలో 2 లక్షల రూపాయల నిధులతో రెండు కల్వట్లు, నాలుగు లక్షల రూపాయలతో రెండు సిసి రోడ్లు, బోరు పంపులు విడిభాగాలు కొనుగోలుకు 5 లక్షల రూపాయలు, 6 సెగ్మెంట్లోత్రాగునీరు పైపులైనుకు రెండు లక్షల రూపాయలు కేటాయించడం జరిగిందన్నారు. కంచికచర్ల గ్రామం, మండలంలో బోరు పంపులు ఫ్లసింగ్ చేసేందుకు ఆరు లక్షల రూపాయల నిధులు సమకూర్చడం జరిగిందని తెలిపారు. మండలంలో 30 లక్షల రూపాయల నిధులతో వివిధ పనులు చేపట్టేందుకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆమోదం తెలిపినట్లు ఎంపీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల సర్పంచ్ వేల్పుల సునీత,ఎంపీడీవో లక్ష్మి కుమారి,తాసిల్దార్ మానస, ఈవో పి ఆర్ డి శ్రీనివాస్, పలు మండల అధికారులు, మండల పరిషత్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అలంకరణ శిక్షణ పై ధ్రువపత్రాలు పంపిణీ



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** ఆచార్య ఎన్.జి రంగా వ్యవ సాయ విశ్వవిద్యాల యం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఘం టసాల ఆధ్వర్యంలో గ్రామీణ యువతకు "అలంకరణ చేపల పెంపకం, యాజమాన్య పద్ధతులు" పై జాతీయ మత్స్య అభివృద్ధి మండలి, హైదరాబాద్ వారి సహకారం తో కె.వి.కెలో శిక్షణ ముగిసింది. అలంకరణ చేపలకు వ్యాధులు వైరల్, బ్యాక్టీరియల్, ఫంగల్, పరాన్న జీవుల వ్యాధులు, చేప పేను పోషకాహార లోపం వలన కలిగే వ్యాధులు గురించి తెలియ చేశారు వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త డా బి. నవీన్ అలంకరణ చేపల పెంపకం ప్రాముఖ్యత గ్రామీణ యువతకు వాటిపై ఉన్న అవకాశాలు క్షుణ్ణంగా వివరించారు. గ్రామీణ యువత రానున్న రోజుల్లో అలంకరణ చేపల వ్యాపారం మొదలుపెట్టే సమయంలో మార్కెట్ వివరణ ఎలా చేయాలి అనే విధానాలపై చర్చించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. సుధా రాణి మాట్లాడుతూ, ఈ శిక్షణ ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని అలంకరణ చేపల పెంపకం ఉపాధిగా మలచుకోవాలని ఆకాక్షించారు. ఈ శిక్షణలో పాల్గొన్న గ్రామీణ యువతకు ప్రోగ్రాం కోఆర్డినేటర్ చేతుల మీదుగా ధ్రువ ప్రత్రాలు అందుకొన్నారు. ట్రైనింగ్ ఇన్చార్జి జె. యశ్వంత్ కుమార్ డా.మంజు వాణి, డా. రేవతి, డా. వెంకట లక్ష్మీ, గ్రామీణ యువత పాల్గొన్నారు.

## కొడాలి నానికి అస్వస్థత.. ఆస్పత్రికి తరలింపు



**గుడివాడ, మేజర్ న్యూస్ :** మాజీ మంత్రి కొడాలి నాని అస్వస్థతకు గురయ్యారు. గ్యాస్ట్రిక్ సమస్యతో ఆయన హైదరాబాద్ లోని ఏఐజీ ఆసుపత్రికి వెళ్లారు. వైద్య పరీక్షల సమయంలో గుండెలోనూ సమస్య ఉందని డాక్టర్లు గుర్తించా రు. దీంతో ఆయనకు చికిత్స అందిస్తున్నట్టు తెలిసింది. ఇదిలా ఉంటే కొడాలి నాని ఆరోగ్యం నిలకడగానే ఉందని, గ్యాస్ సమస్యతోనే ఆసుపత్రికి వెళ్లారని, గుండెకు సంబంధించి ఎటువంటి సమస్య లేదని ఆయన సన్నిహితుడు దుక్కిపాటి శశిభూషణ్ వివరణ ఇవ్వడం గమనార్హం.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి





**పామర్రు మార్చి 26 మేజర్ న్యూస్ :** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందినట్లు పామర్రు ఎస్సై వి రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆయన అందించిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి మండల పరిధిలోని కొత్త పెదమద్దాలి గ్రామంలో కానోళ్ల శేషమ్మ తన కుమారుని ఇంటి వద్ద భోజనం చేసి తిరిగి తన ఇంటికి వెళ్తున్న సయంలో అతివేగంగా వస్తున్న పల్సర్ మోటార్ సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె తలకు, కాళ్లకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్ఐ రాజేంద్రప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళలకు చిరుధాన్యాలపై 3 రోజులు శిక్షణ




**ఘంటసాల, మేజర్ న్యూస్ :** ఆచార్య ఎన్. జి రంగా వ్యవసాయ విశ్వవిద్యా లయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల ఆధ్వర్యంలో మహిళలకు " చిరుధాన్యాలు, తృణధాన్యాలు, పప్పు ధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ " పై కె వి కెలో మూడు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారం భించారు. సమన్వయకర్త డా,, డి. సుధారాణి మాట్లాడుతూ చిరుధాన్యాలలో పోషకాలు ఆరోగ్యానికి ఏంతో మేలు, మహిళలు ఈ శిక్షణ ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ పైన నైపుణ్యం సాధించాలన్నారు. చిన్న కుటీర పరిశ్రమ ఏర్పాటు చేసుకొని అమ్మడం ద్వారా ఆదాయం పొంది తద్వారా ఆర్థికాభివృద్ధిని సాధించవచ్చు అన్న. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి. కృష్ణవేణీ, చిరుధాన్యాలు, తృణధాన్యాలు, పప్పు ధాన్యాలలో లభించే పోషకాలను, ఆరోగ్య ప్రయోజనాలను రోజువారీ ఆహారం లో వీటి ప్రాముఖ్యతను, వివిధ విలువ ఆధారిత ఉత్పత్తులను వివరించి, మిక్స్ డ్ అటుకుల లడ్డూ, రైస్ బ్రాన్ లడ్డు తయారి విధానాన్ని వివరించి తయారు చేయించారు. కేవికే శాస్త్రవేత్తలు డా. వి మంజువాణీ, డా. కె.రేవతి, డా. యం. వెంకట లక్ష్మి ఘంటశాల పాలెం గ్రామ మహిళలూ పాల్గొన్నారు.

# రహదారుల వెంట చలివేంద్రాలను ఏర్పాటు చేయండి





**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు ప్రయత్నంలో పెరిగే అవకాశం ఉన్నదని శాస్త్రవేత్తల ప్రకటనల దృష్ట్యా రహదారుల వెంట చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ కోరారు. దివిసీమ పునర్నిర్మాత, దివిసీమ గాంధీగా పేరుపొందిన,దివంగత మాజీ మంత్రి మండలి వెంకటకృష్ణారావు పేరిట విజయకృష్ణ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ మత్తి శ్రీనివాసరావు వంతెన సెంటర్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శాసనసభ్యులు మండలి ప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారుల వెంట నీరు అందని ప్రాంతాల్లో చలివేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి ఏటా మండలి వెంకటకృష్ణారావు జ్ఞాపకార్థం చదివేంద్రాలను ఏర్పాటు చేస్తున్న మత్తి శ్రీనివాసరావును అభినందించారు. తొలుత మండలి వెంకటకృష్ణారావు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా నాయకులు వంగర శేషగిరిరావు, అవనిగడ్డ సబ్ బ్రాంచ్ చైర్మన్ గుడివాక శేషుబాబు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, మాజీ ఎంపీపీలు బండే కనకదుర్గ, మోర్ల జయలక్ష్మి, రోటరీ క్లబ్ అధ్యక్షులు నూతక్కి శివబాబు, ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ కళ్యాణ వేదికను ప్రారంభించిన ఎమ్మెల్యే యార్లగడ్డ

**గన్నవరం, మార్చి 26, మేజర్ న్యూస్ :** గన్నవరం నియోజకవర్గ కేంద్రమైన గన్నవరం పట్టణంలో శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి దేవస్థానం యొక్క ఆలయ పాలకవర్గం నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ కళ్యాణ వేదికను ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు బుధవారం ఉదయం రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ కళ్యాణ వేదిక ప్రారంభోత్సవానికి హాజరైన యార్లగడ్డ వెంకట్రావును ఆలయ పాలకవర్గం కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతించి శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన కళ్యాణ వేదికను వేదమంత్రోచ్ఛారణల మధ్య రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ ఆలయ పాలకవర్గ సభ్యులను అభినందించారు. త్వరలోనే తాను కూడా రెండు లక్షల రూపాయలను ఆలయ కమిటీ వారికి అందజేయనున్నట్లు తెలిపారు. గన్నవరం నియోజకవర్గ అభివృద్ధి ఏకైక లక్ష్యంగా పనిచేస్తున్నానని గన్నవరం ముఖచిత్రం మార్చే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇటీవల శాసనసభలో తాను ప్రసంగిస్తూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో కృష్ణాజిల్లా లోని పి.ఎ.సి.ఎస్ ల పరిధిలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని దీనిపై ఎంక్వయిరీ చేసి రైతుల సొమ్మును అక్రమంగా కాజేసిన వారిని శిక్షించాలని సంబంధిత మంత్రివర్యులను కోరగా, ఒక వర్గం మీడియా దీనిని సైతం వక్రీకరిస్తూ వార్తలను చిత్రీకరిస్తున్నారని వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని తెలిపారు. తన సొంత కంపెనీ కంటే ఎక్కువగా భావించి గతంలో తాను చైర్మన్ గా పనిచేసిన కేడిసిసి బ్యాంకును ఉన్నత స్థాయిలో నిలిపితే తనను విధుల నుంచి తప్పించి పెద్ద ఎత్తున అవినీతికి తెరలేపారని మరోసారి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 1962 వ సంవత్సరంలో మహానుభావులు పుచ్చలపల్లి సుందరయ్య అధికారంలోకి వచ్చి ఉండుంటే గన్నవరం నియోజకవర్గం అప్పుడే ఉన్నత శిఖరాలకు చేరి ఉండేదని అది జరగకపోవడం గన్నవరం ప్రజల దురదృష్టం అని తెలిపారు. అనంతరం గన్నవరం శాసనసభ్యులుగా వచ్చిన చాలా మంది నాయకులు చిన్న చిన్న పంచాయతీలలో సైతం ఏర్పాటు



చేసి గన్నవరం నియోజకవర్గ అభివృద్ధిలో తమ మార్కు చూపించారని ఎప్పుడూ కూడా మట్టి జోలికి వెళ్లలేదని కానీ గత పది సంవత్సరాలు గన్నవరం నియోజకవర్గం అంటే మట్టే అనే విధంగా భావించి పెద్ద ఎత్తున అక్రమాలకు తెర లేపరని అన్నారు. తాను రాజకీయ జీవితంలో ఎప్పుడూ రాజీ పడలేదని రాబోయే కాలంలో కూడా రాజీ పడే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా తెలిపారు. ఎన్నికల ముందు తాను ప్రకటించిన సూపర్ సిక్స్ ను సాధించే క్రమంలో మల్లవల్లి పారిశ్రామిక కారిడార్ మీద దృష్టి సారించి అశోక్ లేలాండ్ కంపెనీని వెనక్కి తీసుకు వచ్చినట్లు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం, రామవరప్పాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లో వంతెనలు నిర్మించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం దృష్టికి తెలిపానని, త్వరలోనే వాటిని ఏర్పాటు చేసి రైతులకు సౌలభ్యం కల్పిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. గన్నవరం నియోజకవర్గ అభివృద్దే ఏకైక లక్ష్యంగా పనిచేస్తున్నానని మరోసారి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు దాసరి వెంకట బాలవర్ధనరావు, శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి దేవస్థానం యొక్క ఆలయ పాలకవర్గం సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వసంత కాలనీ వాసులు మొండితోక బ్రదర్స్‌ని మరువలేరు





**కంచికచర్ల మార్చి 26 మేజర్ న్యూస్ :** స్థానిక వసంత కాలనీకి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభిమాని యర్రంశెట్టి బాలయ్య నూతన గృహప్రవేశానికి, అమ్మ వారి కోలుపు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్, ఉపసర్పంచ్ వేమా సురేష్ బాబు, ఎంపిటిసి సభ్యురాలు వేమా రోజా రమణి లు పాల్గొని బాలయ్య దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా యర్రంశెట్టి బాలయ్య దంపతులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా వసంతకాలనీ ఇల్లు పై 33కెవి లైను ఉండుటం వలన ఇల్లు నిర్మాణానికి వీలు లేకూండ ఉండేదని,33కెవి లైను ఇల్లు పై నుండి తోలగించేందుకు ఎవరు సాహసించలేదు కాని పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఉపసర్పంచ్ వేమా సురేష్ బాబు చొరవతో గత వైసిపి ప్రభుత్వం లో 33 కెవి లైను తొలగించడం జరిగిందన్నారు. దీనికి సహకరించిన ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. నాలుగు దశాబ్దాల పైబడి వసంత కాలనీవాసులు పడ్డ ఇబ్బందులను మొండితోక బ్రదర్స్ తొలగించారని, వారిని కాలనీవాసులు ఎప్పటికీ మర్చిపోరని ఎర్రంశెట్టి దంపతులు కొనియాడారు. 33 కెవి లైను తొలగించడం వలన ఈ ప్రాంతంలో నూతన గృహ నిర్మాణాలు జరుగుతున్నాయని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు,ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్, ఉపసర్పంచ్ వేమా సురేష్ బాబు, ఎంపిటిసి సభ్యురాలు వేమా రోజు రమణి ల కు మరోసారి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కాలవ పెద్దబాబు, వైసిపి నాయకులు చింతా రవి,దేవిరెడ్డి శ్రీనివాసరావు,కర్నాటి నరసింహారావు,మంగినేని శ్రీను, మంగినేని వెంకట్రామయ్య, బొక్కిసం భూషణం తదితరులు పాల్గొన్నారు.

## పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆచరణలోకి తెచ్చిన పీయం సూర్యఘర్ పథకాన్ని ఉపయోగించుకుని విద్యుత్ బిల్లు నుంచి మినహాయింపు పొందాలని ఉయ్యూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి. కృష్ణ నాయక్ వినియోగదారులను కోరారు. స్థానిక ఓల్డ్ ఎల్ఐసి బజార్లో ఏర్పాటు చేసిన మూడు కిలో వాట్ల సోలార్ ప్లాంటును సందర్శించి పని తీరును పరిశీలించారు. సోలార్ ప్లేట్లను అమర్చుకున్న ఆళ్ల రామకృష్ణ ను కలిసి సోలార్ ప్లాంట్ యొక్క సత్ఫలితాలు ఎలా ఉన్నాయో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు అందరూ విద్యుత్ బిల్లు ఇచ్చిన 15 రోజులలో కరెంటు బిల్లును చెల్లించి సర్ చార్జెస్ నుంచి మినహాయింపు పొందగలరని విద్యుత్ వినియోగదారులందరూ సకాలంలో బిల్లులు చెల్లించాలని కోరారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన తహసీల్దార్



**రెడ్డిగూడెం, మార్చి 26, మేజర్ న్యూస్:** మండలము లోని రెడ్డిగూడెంలో గల 2 ఓవర్ హెడ్ మంచి నీటి ట్యాంక్ లను, ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం తహసీల్దార్ జె సుశీల దేవి తనిఖీ చేసి, రోగులను వైద్య సదుపాయం సరిగా ఉందా లేదని అడిగి తెలుసుకున్నారు, అక్కడ ఉన్న సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. మెడికల్ షాప్ ను తనిఖీ చేసి కాలం చెల్లిన మందులు అమ్మకూడదని అన్నారు. ఒక చౌకధరల దుకాణంను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షా సెంటర్ ను కూడ తనిఖీ చేసారని తహసిల్దార్ తెలిపారు.ఈ కార్యక్రములో మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ గంధం పుల్లయ్య, పంచాయితీ సెక్రటరీ ఎస్. రామారావు, వీఆర్యో జానీసాహెబ్, పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ గురుకులం ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13వ తేదీకి వాయిదా




**రెడ్డిగూడెం, మార్చి 26, మేజర్ న్యూస్:** మండలంలోని గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం (బాలికలు) పాఠశాల రంగాపురం లో 5వ తరగతి, జూనియర్ ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 6వ తేదీన జరగవలసిన ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13వ తేదీకి వాయిదా పడినట్లు ఏపీ ఎస్ డబ్ల్యూ ఆర్ ఈ ఐ సొసైటీ కార్యదర్శి తెలియజేశారని ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు గమనించగలరని ప్రిన్సిపాల్ ఎస్ తబిత తెలిపారు.

## డోజో కరాటేలో అవనిగడ్డ సెయింట్‌ఆన్స్ విద్యార్థుల ప్రతిభ



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** విజయవాడ జోషిత మార్షల్ అసోసియేషన్ వారు నిర్వహించిన ఇంటర్ డోజో కరాటే టోర్నమెంట్ లో స్థానిక సెయింట్ ఆన్స్ స్కూల్‌కి చెందిన విద్యార్థినీ విద్యార్థులు ఇంటర్ డోజో కరాటే టోర్నమెంట్‌లో మెడల్స్ గెలుపొంది సత్తా చాటారు. ఇంటర్ డోజో కరాటే టోర్నమెంట్ విజయవాడ నగరంలో పలు స్కూళ్లలో నిర్వహించి ఇతర ప్రాంతాల్లో కూడా నిర్వహిస్తూ అవనిగడ్డకు రావడం జరిగింది, వారి యొక్క ఇంటర్ డోజో యొక్క ముఖ్య ఉద్దేశం విద్యార్థులలోని నైపుణ్యతను వారి యొక్క ప్రతిభను వెలికి తీయడానికి స్కూళ్లలో ఈ కార్యక్రమాన్ని టిసిఎం సంస్థ వారు ప్ర ప్రదంగా నిర్వహిస్తున్నారని తెలిపారు, ఇందులో బాగంగా అవనిగడ్డ సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో కూడా ఈ డోజో ఇండోర్ కరాటే నిర్వహించగా ఇక్కడ మంచి ప్రతిభ కనబరిచిన వారికి గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ ను ప్రిన్సిపల్ సిస్టర్ చేతుల మీదుగా ప్రధానం చేయడం జరిగిందని తెలిపారు. ప్రిన్సిపల్ సిస్టర్ లూద్ మేరీ మాట్లాడుతూ ఈ కరాటే నైపుణ్యతని జిల్లా ఇంటర్ డోజో లోనే కాక డిస్టిక్, స్టేట్, నేషనల్ లెవెల్ వరకు సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు ప్రతిభను కనపరచాలని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# అన్ని వర్గాల ప్రజలు తిరస్కరించిన ఏకైక సీఎం వైఎస్.జగన్







## తొమ్మిది నెలలల్లో రూ.కోటిన్నరకు పైగానే సీఎంఆర్ఎఫ్ ద్వారా చెక్కులను పంపిణీ చేశాం

### 52 మందికి రూ.62 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందచేసిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్

**కృష్ణలంక, మార్చి 26, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు తిరస్కరించబడిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడ్డారని, అందుకే ఆ పార్టీకి ప్రజలు కేవలం 11 అసెంబ్లీ సీట్లు ఇచ్చారని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ తెలిపారు. బుధవారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధికి చెందినవారికి రాణిగారితోట సెంటర్‌లో 52 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజరైన రూ.62 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే గద్దె రామమోహన్ స్వయంగా లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రిల్లో నగదు చెల్లించి వైద్యచికిత్సలు చేయించుకున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సి.ఎం.ఆర్.ఎఫ్) ద్వారా ప్రభుత్వం పేదలకు వారి చికిత్సలకు అయిన నగదును అందచేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ తొమ్మిది నెలల కాలంలోనే తూర్పు నియోజకవర్గంలోనే సుమారు 200 మందికి కోటిన్నర రూపాయలకు పైగానే సి.ఎం.ఆర్.ఎఫ్. చెక్కులను అందచేసినట్లు తెలిపారు. ప్రస్తుతం తూర్పు నియోజకర్గానికి చెందిన 52 మందికి రూ.62 లక్షల విలువైన చెక్కులను అందచేస్తున్నట్లు చెప్పారు. ఒకొక్కరికి రూ.30 వేల నుంచి లక్ష రూపాయలకు పైగా విలువైన చెక్కులను అందచేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన వెంటనే ఈ సి.ఎం.ఆర్.ఎఫ్.ను ప్రారంభించారని తెలిపారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పేరుతో పేదలకు వైద్యసేవలను అందించారని వివరించారు. రాజశేఖర్‌రెడ్డి తనయుడు వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేశాడని గుర్తుచేశారు. అన్ని వర్గాల నుంచి తిరస్కరించబడిన ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే అది ఒక్క వైఎస్.జగన్ మోహన్‌రెడ్డేనని అన్నారు. ఇసుక దొరక్కకుండా చేసి కార్మికులకు జీవనోపాధిని వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దారుణంగా దెబ్బతీశాడన్నారు. ఇసుక పుష్కలంగా లభిస్తుండటంతో రోడ్లపై లారీలు వెళుతున్నాయంటే వైఎస్సార్‌సీపీ నాయకులు ఆందోళన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలకు ఇసుక దొరకకుండా చేయాలనే వైఎస్సార్‌సీపీ ఈ విధంగా ప్రయత్నిస్తోందని విమర్శించారు. సంక్షేమం, అభివృద్ధి అనేవి రెండు కళ్ళు లాంటివని చెప్పారు. వైద్యచికిత్సలు అవసరమైనవారు ప్రవేటు ఆసుపత్రిల్లో చికిత్సలు చేయించుకుని సి.ఎం.ఆర్.ఎఫ్. ద్వారా లబ్ధి పొందాలని, ఈ సదవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని, ఈ విషయంపై విస్తృతంగా ప్రచారం చేయాలనే ఇలా బహిరంగంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందచేస్తున్నామన్నారు. రాజకీయాలకు ఆతీతంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందచేస్తున్నామని, అర్హతలు ఉంటే వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలకు కూడా సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందచేస్తామని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. బొప్పన భవకుమార్ మాట్లాడుతూ నిత్యం ఉదయం 8 గంటల నుంచే నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అందుబాటులో ఉంటున్నారని చెప్పారు. 17, 18 డివిజన్ల వాసులు ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌కు అండగా ఉండాలని, వచ్చే కార్పోరేషన్ ఎన్నికల్లో ఈ డివిజన్‌లో కూటమి పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించేలా చూడాలన్నారు. ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌కు తామంతా ఎల్లప్పుడు తోడుగా ఉంటామని చెప్పారు.

జనసేన పార్టీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అమ్మిశెట్టి వాసు మాట్లాడుతూ ఒక వైపున ఆరోగ్యశ్రీ పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేస్తునే మరో వైపున సీఎంఆర్ఎఫ్ ద్వారా కూటమి ప్రభుత్వం చెక్కులను అందచేస్తోందన్నారు. తొమ్మిది నెలల కాలంలోనే కోటిన్నర రూపాయలకు పైగానే చెక్కులను సీఎంఆర్ఎఫ్ ద్వారా అందించిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌ను ప్రత్యేకంగా అభినందించాలన్నారు. ఇసుకను ఉచితంగా అందచేస్తున్నామని, అది సహించలేక వైఎస్సార్‌సీపీ నాయకులు అవాస్తవాలు చెబుతున్నారు. బీజేపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి పోతంశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ ద్వారా చెక్కులను అందచేస్తూ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ నియోజకవర్గ ప్రజలు అండగా నిలుస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమములో కార్పోరేటర్ ముమ్మనేని ప్రసాద్, పార్టీ నాయకులు వేముల దుర్గారావు, రాయి రంగమ్మ, గొరిపర్తి నామేశ్వరరావు, మోటేపల్లి చిన్నా, పలిశెట్టి అన్నారావు, భాగం సాయి. నందిపాటి దేవానంద్, దాసరి గాబ్రియేలు, పడాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



## హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయం

**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** నగరంలో పనిచేస్తున్న హోంగార్డులలో ఎవరైనా మరణించిన లేక పదవీ విరమణ చేసిన వారు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా చేయడానికి నగరంలో పనిచేస్తున్న హోంగార్డులు అందరూ స్వచ్ఛందంగా వారికి వచ్చే వేతనం నుండి సదరు చనిపోయిన హోంగార్డు కుటుంబాలకు లేదా పదవీ విరమణ చేసిన హోంగార్డులకు ఆర్థిక ఆసరా కల్పిస్తున్న విషయం విదితమే. ఈ సందర్భంగా నగర హోంగార్డు యూనిట్‌లో విధులు నిర్వహిస్తూ ది. 1.02.2025న ఎమ్.పద్మావతి హార్ట్ అట్టాక్‌తో మరణించారు. వారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా రూ.5 లక్షల నగదు చెక్కును బుధవారం సీపీ కార్యాలయంలో పోలీస్ కమీషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు చేతులమీదుగా చనిపోయిన హోంగార్డ్ కుమారుడైన క్రాంతికుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డి.సి.పి. కె.జి.వి.సరిత, హోంగార్డు ఆర్.ఐ కె.సుధాకర్ రెడ్డి, ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎమ్.సోమయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బడుగు, బలహీనవర్గాల ఆరోగ్య భద్రతే లక్ష్యం..

### 64 మందికి దాదాపు 26లక్షలు సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

### ఎమ్మెల్యే కుమార్ రాజా



**పామర్రు మార్చి 26 మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని పామర్రు శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయన్నారు. రాష్ట్రంలో వైద్యం, విద్యకు సీఎం పెద్దపీట వేస్తున్నారని, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఎవరు భయపడవలసిన అవసరం లేదని, ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందిస్తామని ఎమ్మెల్యే కుమార్ రాజా భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి సహాయనిధి కష్టాల్లో ఉన్న పేదలకు పెన్నిధి వంటిదని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఆపద సమయంలో అత్యవసరంగా అప్పుచేసి వైద్యం చేయించుకున్న పేదలకు ఈ సహాయనిధి కొండంత అండగా నిలుస్తుందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ ప్రైవేటు వైద్యశాలలో లక్షలు ఖర్చుచేసి వైద్యం చేయించుకున్న లబ్ధిదారులను ఆదుకునేందుకు చంద్రబాబు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఆర్థిక సహాయం అందిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక అరాచకాలు సృష్టించి, అప్పులుచేసి రాష్ట్ర ఖజానాను ఖాళీ చేశారని విమర్శించారు. కష్టమైనా అభివృద్ధి, సంక్షేమం దిశగా చంద్రబాబు పాలన అందిస్తున్నారన్నారు. ముందుగా నియోజకవర్గ పరిధిలోని 64 మంది లబ్ధిదారులకు పామర్రు లోని పార్టీ కార్యాలయంలో 25,73,297 రూపాయలు చెక్కులను ఎమ్మెల్యే కుమార్ రాజా అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని మొవ్వ మండలంలో 16 మందికి 6,87,287 రూపాయలు, పామర్రు మండలంలో 14 మందికి 5,53,111రూపాయలు, పమిడిముక్కల మండలంలో 14 మందికి 5,46,001 రూపాయలు, తోట్లవల్లూరు మండలంలో 14 మందికి 3,83,911 రూపాయలు, పెదపారుపూడి మండలంలో ఆరుగురు లబ్ధిదారులకు 4,02,987 రూపాయలు వంతున మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే కుమార్ రాజాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పామర్రు, మొవ్వ మండలాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, లింగమనేని రామలింగేశ్వరరావు, పామర్రు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు జక్కా శ్రీనివాసరావు, చింతపల్లి వెంకటేశ్వరరావు, చాట్ల రమేష్, దాలిపర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్టాండ్‌లో సేదతీరుతున్న మద్యం బాబులు





**కంచికచర్ల మార్చి 26 మేజర్ న్యూస్ :** కంచికచర్ల ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల కొరకు ఏర్పాటు చేసిన కుర్చీల్లో యదేచ్ఛగా మద్యం బాబులు సేద తీరుతున్నారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై సంబంధిత ఆర్టీసీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మద్యం బాబులు పగల సమయంలో కూడా కుర్చీల్లో పండుకోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు కూర్చునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా ఆర్టీసీ అధికారులు మద్యం బాబులను బస్టాండ్‌లో సేద తీరకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999